'ఓట్ చోరీ'పై పోరు: ఇండియా కూటమి నేతలకు రాహుల్ గాంధీ టీ విందు

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం

నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు - తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9059548848

హైదరాబాద్. ఎడిటర్:- వై. రమ నాగరాజు సంపుటి:-32 సంచిక:-229 మంగళవారం 13-10-2026

టీమిండియా ఆలౌట్.. వెస్టిండీస్ టార్గెట్ 224 పరుగులు

ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది.ప్రత్యర్థి వెస్టిండీస్ ముందుకు 224 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీతో చెలరేగగా, మిగతా బ్యాటర్లు వేగంగా పరుగులు సాధించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేయగలిగింది.

అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ అభిషేక్ శర్మ (69) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో బలమైన పునాది వేశాడు. విండీస్ బౌలర్లను నలువైపులా బాదుతూ వేగవంతమైన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో అత్యంత వేగంగా 2000 పరుగులని కూడా పూర్తి చేసుకున్నాడు అభిషేక్, మరోవైపు, మిడిల్ ఆర్డర్లో ఇషాన్ కిషన్ (37), తిలక్ వర్మ (28), ఆల్ రౌండర్లు నితీష్ కుమార్ రెడ్డి (21), అక్షర్ పటేల్ (20) లు వేగంగా పరుగులు సాధించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. అయితే, సంజు శాంసన్ (3), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1), నమన్ ధీర్ (10)లు తక్కువ పరుగులకే అవుటై నిరాశపరిచారు.

ధరల పెరుగుదలకు మేం కారణం కాదు: ట్రంప్ ఆరోపణలను తిప్పికొట్టిన జెలెన్స్కీ

- పశ్చిమాసియా యుద్ధం, హర్మూజ్ జలసంధి దిగ్బంధనమే కారణమని స్పష్టం చేసిన జెలెన్స్కీ
- రష్యా దాడులు ఆపితే ఇంధన కేంద్రాలపై దాడులు నిలిపివేస్తామంటూ ప్రతిపాదన
- ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన 'ఎనర్జీ కాల్పుల విరమణ'పై ఆశ్చర్యం వ్యక్తం చేసిన జెలెన్స్కీ
- 60 రోజుల కాల్పుల విరమణ ఇస్తే ఎన్నికలు నిర్వహిస్తామని మరో ఆఫర్

అమెరికాలో ఇంధన ధరల పెరుగుదలకు ఉక్రెయినే కారణమంటూ వస్తున్న ఆరోపణలను ఆ దేశ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ

చెన్నై ఎయిర్‌పోర్టులో ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికిన సీఎం విజయ్

చెన్నై: తమిళనాడు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి చెన్నై విమానాశ్రయంలో సీఎం సి. జోసెఫ్ విజయ్ ఘన స్వాగతం పలికారు.

ఈ రోజు ఉదయం 11 గంటలకు ప్రత్యేక విమానంలో చెన్నై చేరుకున్న ప్రధాని మోదీకి గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, సీఎం విజయ్‌తో పాటు అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి, బీజేపీ నేత నైనార్ నాగేంద్రన్ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి పోరూర్ మెట్రో స్టేషన్ వరకు ప్రధాని రోడ్ షో నిర్వహించారు. అనంతరం సీఎం విజయ్ తో కలిసి పూనమల్లి - వడపళని మధ్య నూతనంగా నిర్మించిన చెన్నై మెట్రో ఫేజ్-2 ను ప్రారంభించి, ఇద్దరూ కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ ప్రాజెక్టుల విలువ దాదాపు రూ. 13,000 కోట్లు. - మిగతా 2 లో

ఇండియా కూటమి మహాధర్నాలో పాల్గొనడానికి ఢిల్లీకి వెళుతున్న తెలంగాణ కాంగ్రెస్ నేతలు

ఢిల్లీకి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు పొన్నం ప్రభాకర్ అడ్లూరు లక్ష్మణ్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పయనం ! ఓటరు సవరణ ప్రక్రియ లో జరుగుతున్న అక్రమాలు ,జజుజ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రేపు ఇండియా కూటమి మహాధర్నా లో పాల్గొననున్న తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం!

క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ మోసం.. ఇద్దరు అంతరాష్ట్ర నిందితుల అరెస్ట్!

ఐటీసీ గ్లోబల్ పేరుతో పెట్టుబడుల మోసం.. రూ. 10 కోట్లకు పైగా వసూళ్లు చేసినట్లు అనుమానం.

హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే
రేవంత్ సంచలన ఆరోపణ

- గోవాలో రేవంత్ రెడ్డి పర్యటన
- సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు
- ఆయన ప్రమోద్ సావంత్ కాదు, ప్రాపర్టీ సావంత్ అని విమర్శ
- హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్‌కు మూలం గోవానేనని ఆరోపణ
- భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపాటు
- గోవాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్న' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే

'ఓట్ల చోరీ'ని ఆపాలి

- రేపు సుప్రీంకోర్టు వరకు 'ఇండియా మార్చ్'భయపడకుండా రండి
- ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేయనున్న విపక్షాలు
- సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించాలని రాహుల్ గాంధీ పిలుపు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ రాసినట్లు తెలిపిన ఖర్గే
- శాంతియుత నిరసనకారులపై దాడులు జరిగాయని రాహుల్ ఆరోపణ

ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, 'ఓట్ల చోరీ' జరుగుతోందని ఆరోపిస్తున్న - మిగతా 2 లో

విజయవాడ ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రశంసల లేఖ

- విజయవాడ ఉత్సవ్ 2.0 నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం
- ఏపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అభినందనలు తెలుపుతూ లేఖ
- దసరా ఉత్సవాలతో పాటు అక్టోబర్ 11 నుంచి వేడుకలు
- ఈ ఉత్సవాలు పర్యాటకానికి కొత్త ఊపునిస్తాయని మోదీ ప్రశంస
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తన అభినందనలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఆయన ఒక లేఖ రాశారు. విజయవాడలో ఈ ఉత్సవాలను నిర్వహించడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనంలో విజయవాడకు ఒక ప్రత్యేక స్థానం ఉందని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తాయని, పర్యాటక రంగానికి తాజా ఉత్తేజాన్ని ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ ప్రజలకు, వారి సాంస్కృతిక వారసత్వానికి మధ్య ఉన్న బంధాన్ని

ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి

- ఇప్పుడున్నది ఎమర్జెన్సీ కాదు, ముందు జాగ్రత్త చర్యలేనన్న కిషన్ రెడ్డి
- ప్రజాస్వామ్యంపై పాఠాలు చెప్పే అర్హత కాంగ్రెస్‌కు లేదని విమర్శ
- తెలంగాణకు వచ్చి చూడాలంటూ రాహుల్ గాంధీకి సవాల్
- బీజేపీ కార్యక్రమాలను రేవంత్ సర్కార్ అడ్డుకుంటోందని ఆరోపణ
- దేశంలో అశాంతికి కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని వ్యాఖ్య

నిజమైన ఎమర్జెన్సీ అంటే ఏమిటో, - మిగతా 2 లో

పౌరులే లక్ష్యంగా దాడులు ఆమోదయోగ్యం కాదు



- రియాద్ ఎయిర్‌పోర్ట్ ఘటనపై భారత్ ఘాటు స్పందన
- రియాద్ ఎయిర్‌పోర్ట్‌పై క్షిపణి దాడిని తీవ్రంగా ఖండించిన భారత్
- ఈ దాడిలో 12 మంది మృతి.. 300 మందికి పైగా గాయాలు
- పౌరుల లక్ష్యంగా దాడులు చేయడం ఆమోదయోగ్యం కాదన్న భారత విదేశాంగ శాఖ
- సౌదీ ప్రభుత్వానికి, ప్రజలకు సంఘీభావం. - మిగతా 2 లో

పత్రికా స్వేచ్ఛపై దాడి

- జర్నలిస్టులపై విరుచుకుపడిన పోలీసులు
- ఢిల్లీ నిరసనల ఘటనలపై ?పలు జర్నలిస్టు సంఘాల ఆగ్రహం
- ప్రెస్ కార్డులు చూపించినా అదుపులోకి తీసుకున్నారు
- ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని ఆరోపణలు
- మహిళా జర్నలిస్టుల లైంగికదాడి ఆరోపణలపైనా చర్యలు తీసుకోవాలి: ఎడిటర్స్ గిల్డ్ డిమాండ్

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులపై పోలీసులు, భద్రతా బలగాలు వ్యవహరించిన తీరుపై పలు జర్నలిస్టు సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రెస్ కార్డులు చూపించినప్పటికీ పలువురు విలేకరులను అదుపులోకి తీసుకోవడం, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల ఫోన్లను స్వాధీనం చేసుకోవడం, వారిపై దౌర్జన్యానికి పాల్పడినట్టు ఆరోపణలు

సీఈసీపై పోరు.. వాయిదా పడిన రాహుల్ గాంధీ గోవా పర్యటన!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాల నిరసనలు
- ఢిల్లీ ఆందోళనల్లో పాల్గొనాలని రాహుల్ గాంధీ నిర్ణయం
- ప్రస్తుతానికి వాయిదా పడిన గోవా పర్యటన
- రాహుల్ పర్యటన వాయిదాపై గోవా కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన గోవా పర్యటనను వాయిదా వేసుకునే అవకాశం ఉంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో

క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ మోసం.. ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్!

మొదటిపేజీ తరువాయి – రెండేళ్లలో పెట్టుబడులు రెట్టింపు అవుతాయని, అధిక లాభాలు వస్తాయని నమ్మించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 500 మంది బాధితులను మోసం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. రూ.1,000 నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి ప్యాకేజీలు ప్రవేశపెట్టి, కొత్త సభ్యులను చేర్చిన వారికి 25 శాతం వరకు కమీషన్ ఇస్తామని ఆశ చూపినట్లు గుర్తించారు. జూమ్ మీటింగ్‌లు, హోటళ్లలో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను ఆకర్షించారు. ఆదిలాబాద్‌లోనూ పలువురు బాధితులు.. ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితులు లక్షల రూపాయలు పెట్టుబడిగా చెల్లించినట్లు ఫిర్యాదులు అందాయి. ప్రధాన ఫిర్యాదులో జువ్వక నర్సింలు రూ.7.50 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు పేర్కొన్నారు. ఇతర బాధితుల ఫిర్యాదులు తీసుకొని దర్యాప్తు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

టీమిండియా ఆలౌట్.. వెస్టిండీస్ టార్గెట్ 224 పరుగులు

మొదటిపేజీ తరువాయి – **చివరి ఓవర్లో ప్రిన్స్ యాదవ్ బాదుడు:** చివర్లో పేసర్ ప్రిన్స్ యాదవ్ (13) బౌండరీ (4,0, 4, 4, 1ఎ, ఔ)లతో మెరిశాడు. చివరి ఓవర్లో వరుస బౌండరీలతో చెలరేగి జట్టు స్కోరును 223 పరుగులు చేయడంలో కీలక పాత్ర పోషించాడు.

కట్టడి చేసిన కరేబియన్ బౌలర్లు: ఒకానొక దశలో భారత్ భారీ స్కోరు సాధించేలా కనిపించినా.. వెస్టిండీస్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ కట్టడి చేశారు. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్, స్ప్రింగర్, షమర్ జోసెఫ్‌లు రెండేసి వికెట్లు పడగొట్టగా.. కీమో పాల్, గుడాకేష్ మోటీలకు తలో వికెట్ దక్కింది. ఇప్పటికే 1-1తో సమంగా ఉన్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో లీడ్ సాధించాలంటే విండీస్ 224 పరుగులు చేయాల్సి ఉంది.

హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే: రేవంత్ సంచలన ఆరోపణ

మొదటిపేజీ తరువాయి – దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దిశా డైలీ కథనం ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు. రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

'ఓట్ల చోరీ'ని ఆపాలి

మొదటిపేజీ తరువాయి – ప్రతిపక్షాలు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేశాయి. ఈ అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. ఈ మార్చ్‌లో ప్రజలందరూ పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "ఓట్ల చోరీకి ముగింపు పలకాలని, ఎలక్టోరల్ రోల్స్, ఈవీఎంలకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశం తరపున సీజేఐ సూర్యకాంత్‌కు వినతిపత్రం సమర్పిస్తాం" అని రాహుల్ గాంధీ ఆ వీడియోలో తెలిపారు. "భయపడొద్దు. ప్రేమ, సోదరభావం, దేశభక్తితో కలిసి నడుద్దాం. రేపు యావత్ భారతదేశం సుప్రీంకోర్టుకు కదులుతుంది" అని ఆయన అన్నారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా దేశంలో గందరగోళం, భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ తాను, రాహుల్ గాంధీ లేఖలు రాసినట్లు ఖర్గే వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సమయం కోరినట్లు తెలిపారు. శనివారం ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన యువతపై పోలీసులు, బీజేపీ గూండాలు దాడి చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్, మోహన్ భగవత్ వంటి వారు భారత ప్రజల గొంతు నొక్కలేరని, వారి పిరికిపంద చర్యలకు భయపడేది లేదని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మార్చ్‌లో యువత, ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ బృందాలు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి

మొదటిపేజీ తరువాయి – ఆ సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో రాహుల్ గాంధీ ముందుగా తెలుసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హితవు పలికారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష బీజేపీని ఎలా అణచివేస్తోందో స్వయంగా చూడటానికి రావాలని ఆయన రాహుల్‌ను ఆహ్వానించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలను, 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీతో విపక్షాలు పోల్చడంపై కిషన్ రెడ్డి స్పందించారు. ఇవి ఎమర్జెన్సీ కాదని, దేశంలో అశాంతి సృష్టించేందుకు కొన్ని దేశ వ్యతిరేక, అంతర్జాతీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అందుకే ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విపక్షాలు లేనిపోని సమస్యలను సృష్టించి వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యం పేరుతో కాంగ్రెస్ పార్టీ తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. "1975లో కాంగ్రెస్ వేలాది మందిని జైళ్లలో పెట్టింది, మీడియాపై నిషేధం విధించింది, పౌరుల హక్కులను కాలరాసింది" అని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో తాము శాంతియుతంగా కార్యక్రమాలు చేయాలన్నా హైకోర్టు అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎలాంటి ఆంక్షలు విధిస్తోందో రాహుల్ వచ్చి చూడాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు సేవ చేయడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటివి చేపడుతున్నామని ఆయన వివరించారు.

విజయవాడ ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రశంసల లేఖ

మొదటిపేజీ తరువాయి – ఈ వేడుకలు మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దసరా ఉత్సవాలకు అనుగుణంగా ఇవాళ్టి (అక్టోబర్ 11) నుంచి విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలు ప్రారంభం కానున్నాయి. నగరంలోని మకినేని బసవపున్నయ్య స్టేడియం, పున్నమి ఘాట్ సహా పలు ప్రాంతాలు ఈ ఉత్సవాలకు వేదికలుగా నిలవనున్నాయి. నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించడం, స్థానిక ఆర్థిక అవకాశాలను మెరుగుపరచడం ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశం. ఈ వేడుకలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా జాతీయ సరస్ మేళాను కూడా నిర్వహిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసే స్టాళ్లు ఈ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకంపై దృష్టి పెట్టడంతో పాటు స్థానిక కళాకారులకు మద్దతు ఇవ్వడమే ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ సహా నిర్వాహకులు చెబుతున్నారు. ప్రధాని నుంచి ప్రశంసలు రావడంతో ఈ కార్యక్రమంపై మరింత ఆసక్తి నెలకొంది.

పత్రికా స్వేచ్ఛపై దాడి

మొదటిపేజీ తరువాయి – రావడం పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించాయి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను, ప్రజల తరపున వార్తలు అందించే మీడియాను అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేశాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఈనెల 10న ఢిల్లీలో జరిగిన నిరసనలను కవర్ చేస్తున్న సమయంలో జర్నలిస్టులపై ఈ చర్యలు చోటుచేసుకున్నాయి. జంతర్ మంతర్ పరిసరాల్లో పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు పలువురు మీడియా ప్రతినిధులను అదుపులోకి తీసుకున్నట్టు పలు కథనాలు వెలువడ్డాయి.జర్నలిస్టుల రక్షణ కోసం పనిచేసే కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) ఈ ఘటనపై స్పందించింది. అదుపులోకి తీసుకున్న జర్నలిస్టులు, మీడియా సిబ్బందిని వెంటనే విడుదల చేయాలనీ, స్వాధీనం చేసుకున్న పరికరాలను తిరిగి ఇవ్వాలనీ, వారిపై భౌతిక దాడులు జరిగాయన్న ఆరోపణలపై విచారణ జరపాలని ఢిల్లీ పోలీసులను కోరింది. నిరసనలు, వాటిని పోలీసులు ఎదుర్కొంటున్న తీరుపై మీడియా ఎలాంటి అడ్డంకులూ లేకుండా వార్తలు అందించే

ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి

మొదటిపేజీ తరువాయి – దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

సీఈసీపై పోరు.. వాయిదా పడిన రాహుల్ గాంధీ గోవా పర్యటన!

మొదటిపేజీ తరువాయి – పాల్గొనేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. వచ్చే వారం ఢిల్లీలో జరగనున్న ఈ నిరసన కార్యక్రమాల్లో ఆయన పాలుపంచుకోవాల్సి ఉన్నందున, గోవా పర్యటనను రీషెడ్యూల్ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియలోని లోపాలు, ప్రజాస్వామ్య జవాబుదారీతనం వంటి అంశాలపై విపక్ష కూటమి ఈ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ కీలక సమయంలో రాహుల్ గాంధీ ఢిల్లీలోనే ఉండటం వల్ల విపక్షాల ఐక్యత బలపడుతుందని, పోరాటానికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో పెద్దగా క్రియాశీలంగా లేని పలువురు విపక్ష నేతలు కూడా ఈ నిరసనల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి, 2027 గోవా అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ పర్యటనను ఖరారు చేశారు. పార్టీ కార్యకర్తలతో సమావేశం, ప్రజలతో మమేకం కావడం, సంస్థాగత బలోపేతం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రణాళిక రచించారు. అయితే, రాహుల్ పర్యటన వాయిదాపై గోవా కాంగ్రెస్ నేతల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు నేతలు 'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా జరుగుతున్న జాతీయ స్థాయి పోరాటానికే ప్రాధాన్యం ఇవ్వాలని అంటుండగా, మరికొందరు రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి రాహుల్ పర్యటన ఎంతో ముఖ్యమని అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలో నిరసనలు ముగిసిన తర్వాత గోవా పర్యటనకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ ప్రణాళిక

మొదటిపేజీ తరువాయి – ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి గారు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. ఈ 8 నెలల పాటు ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదని తెలిపారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌నినో ప్రభావంపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సినిమా, మీడియా, కళాజాతాలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనా వేసి, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి గారు తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో, కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని గుర్తుచేశారు. **VB-G RAM G** పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తర్వాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని, టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాను సీఎంఓ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, డీజీపీ సీవీ ఆనంద్ , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పౌరులే లక్ష్యంగా దాడులు ఆమోదయోగ్యం కాదు

మొదటిపేజీ తరువాయి – సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన క్షిపణి దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. పౌరులు, పౌర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇలాంటి దాడులు పునరావృతం కావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. గత దశాబ్ద కాలంలో సౌదీ గడ్డపై జరిగిన అత్యంత భయానక దాడిగా దీనిని భావిస్తున్నారు. రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దేశీయ విమానాల కోసం కేటాయించిన టెర్మినల్స్ 3, 4 ఉన్న ప్రాంతంలో ఈ క్షిపణి దాడి జరిగింది. అక్టోబర్ 10న జరిగిన ఈ దారుణ ఘటనతో పాటు గత కొన్ని రోజులుగా రియాద్ విమానాశ్రయంపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. 'పౌరులపై దాడులను తక్షణమే నిలిపివేయాలి' అని ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది. సౌదీ అరేబియా సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో ఆ దేశ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా నిలుస్తుందని తెలిపింది. ఈ ప్రాంతంలో వీలైనంత త్వరగా శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించింది. ఈ దాడి వెనుక యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల హస్తం ఉందని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆరోపించాయి. మృతుల్లో సౌదీ, బంగ్లాదేశ్, పాలస్తీనా, అమెరికా, ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, సూడాన్ పౌరులు ఉన్నారు. ఈ వారంలో రియాద్ విమానాశ్రయంపై ఇది మూడో దాడి కావడం గమనార్హం. దాడి కారణంగా శనివారం విమానాశ్రయ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసి, విమానాలను దారి మళ్లించారు.

ధరల పెరుగుదలకు మేం కారణం కాదు: ట్రంప్ ఆరోపణలను తిప్పికొట్టిన జెలెన్స్కీ



మొదటిపేజీ తరువాయి – తీవ్రంగా ఖండించారు. పశ్చిమాసియా సంక్షోభం, హార్మూజ్ జలసంధి దిగ్బంధనం వల్లనే ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ చేస్తున్న విమర్శలకు జెలెన్స్కీ దీటుగా బదులిచ్చారు. "పుతిన్‌ను ఎలా అడ్డుకోవాలో వారికి తెలియదు. బలహీనులపై ఒత్తిడి తీసుకురావడం సులభం కాబట్టి, ఇంధన ధరల పెరుగుదలను ఉక్రెయిన్‌తో ముడిపెట్టి మాట్లాడుతున్నారు" అని జెలెన్స్కీ వ్యాఖ్యానించారు. రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలపై ఉక్రెయిన్ చేస్తున్న డ్రోన్ దాడుల కారణంగానే అమెరికాలో డీజిల్ ధరలు పెరుగుతున్నాయని ట్రంప్ ఆరోపించారు. ఈ దాడుల వల్ల అమెరికా రైతులు, పాడి పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే వీటిని నిలిపివేయాలని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన జెలెన్స్కీ, 'ఇంధన కాల్పుల విరమణ'కు తాము సిద్ధమని ప్రకటించారు. రష్యా గనుక తమ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు నిలిపివేస్తే, తాము కూడా రష్యా ఇంధన కేంద్రాలపై దాడులను ఆపేస్తామని ప్రతిపాదించారు. "మాపై దాడులు ఆపండి, మా పిల్లలను చంపకండి.. అప్పుడు మేము కూడా మీ డీజిల్ కేంద్రాలపై దాడులు నిలిపివేస్తాం. ఇదొక సరైన ఒప్పందం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. గత వారం రోజుల్లోనే రష్యా తమ విద్యుత్ రంగంపై 196 సార్లు, చమురు, గ్యాస్ కేంద్రాలపై 20 సార్లు దాడులు చేసిందని, ఈ ఘటనల్లో 153 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని జెలెన్స్కీ వివరించారు. ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో స్పందిస్తూ.. "రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణమే 'ఇంధన కాల్పుల విరమణ' అమల్లోకి వచ్చింది. దీనికి ఇరు పక్షాలు అంగీకరించాయి" అని పోస్ట్ చేయడం గమనార్హం. అయితే, ఈ ప్రకటన తనకు ఆశ్చర్యం కలిగించిందని, మాస్కో నుంచి దీనిపై ఎటువంటి సమాచారం లేదని జెలెన్స్కీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లో కొత్త అధ్యక్షుడు రావాలన్న ట్రంప్ పిలుపునకు బదులిస్తూ.. 60 రోజుల పాటు సంపూర్ణ కాల్పుల విరమణ ప్రకటిస్తే, దేశంలో ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధమని జెలెన్స్కీ మరో ప్రతిపాదన చేశారు.

రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం, మంత్రులు ఢిల్లీ చక్కర్లు కొడుతున్నారు

లిక్కర్ కంపెనీలకు నీటి సరఫరాపై శ్రద్ధ.. రైతులకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్ర విమర్శలు సంగారెడ్డి అక్టోబర్ 12 నిలువుటద్దం ప్రతినిధి: రాష్ట్రంలో రైతులు సాగునీరు, విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటిని పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు మాత్రం ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యత ఇస్తున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ రైతుల కష్టాల కంటే ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమయ్యాయని మండిపడ్డారు. రాష్ట్రంలో తాగునీరు, సాగునీటి సమస్యలపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నీళ్లు ఇవ్వరు.. లిక్కర్ కంపెనీలకు మాత్రం సరఫరా చేస్తారా? రాష్ట్రంలో రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే బీర్, లిక్కర్ కంపెనీలకు నీటిని సరఫరా చేయడంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ రైతులకు సాగునీరు అందించడంలో కనిపించడం లేదని చింతా ప్రభాకర్ విమర్శించారు. సింగూరు ప్రాజెక్టులోని నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాల్సి ఉండగా, లిక్కర్ కంపెనీలకు నీటి సరఫరా విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఆరోపించారు. లిక్కర్ కంపెనీలకు నీటి కొరత రాకూడదని అబ్కారీ మంత్రి చెబుతున్నారని, మరి రైతులకు నీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. లిక్కర్ కంపెనీలపై ఉన్న ప్రేమ రైతులపై ఎందుకు లేదని ప్రశ్నించిన ఎమ్మెల్యే, రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి కంపెనీల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. నీటి వనరుల వినియోగంలో ప్రజల తాగునీటి అవసరాలు, రైతుల సాగునీటి అవసరాలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారే అవకాశాలున్నప్పటికీ, వాటిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడంలో విఫలమైందని చింతా ప్రభాకర్ ఆరోపించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణ, రైతులకు సాగునీటి సరఫరా, పంటల రక్షణ, విద్యుత్ సరఫరాపై సమగ్ర కార్యాచరణ రూపొందించాల్సి ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతోనే రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారరు . ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యం కారణంగానే రాష్ట్రంలో విద్యుత్ కోతల సమస్య మొదలైందని ఎమ్మెల్యే విమర్శించారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే నీటి సమస్యతో సతమతమవుతున్న రైతులకు విద్యుత్ కోతలు మరింత భారంగా మారుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు రైతు వేదికల వద్దకు రావాలని అధికారుల ద్వారా ఉదయం ఫోన్ చేసి సమాచారం అందించి, చివరి నిమిషంలో ఆ కార్యక్రమాన్ని రద్దు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని చింతా ప్రభాకర్ మండిపడ్డారు. రైతులు ఎదుర్కొంటున్న గంభీరమైన సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు కనుగొనాల్సిన సమయంలో సమావేశాలను రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో తాగునీరు, సాగునీటి సమస్యలపై చర్చించాల్సిన మంత్రుల సమావేశాన్ని అర్ధాంతరంగా రద్దు చేసి ఢిల్లీ పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత కావాలని హితవు పలికారు. తెలంగాణ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా ఢిల్లీ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా పర్యటనలు చేయడంపై చింతా ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రైతుల పంటలు, సాగునీరు, విద్యుత్ సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని నిలదీశారు. రాష్ట్ర ప్రజల అవసరాలను పక్కనపెట్టి పార్టీ రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ పర్యటనలు, ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. నీటి వనరుల సమర్థ నిర్వహణ, తాగునీటికి ప్రాధాన్యత, సాగునీటి లభ్యత, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రైతుల కష్టాలను అర్థం చేసుకుని వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి, మంత్రులపై ఉందని చింతా ప్రభాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత కావాలని, రైతులను నిర్లక్ష్యం చేస్తే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సేవ్ ఓట్ -- సేవ్ డెమోక్రసీ'తో ఢిల్లీలో ప్రతిపక్షాల నిరసన గళం

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం.. ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలి

చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

ఎన్నికల సంఘం తీరుపై నిరసన.. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్

సిద్దిపేట రిపోర్టర్ । నిలువుటద్దం ప్రతినిధి అక్టోబర్ 12 దేశంలో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రతను కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన 'సేవ్ ఓట్ -- సేవ్ డెమోక్రసీ' అఖిలపక్ష మహా ధర్నాలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో 'సేవ్ ఓట్ -- సేవ్ డెమోక్రసీ' నినాదం మార్మోగింది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్ష పార్టీలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను ప్రస్తావిస్తూ, ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని నాయకులు కోరారు. ఓటర్ల జాబితాల రూపకల్పన నుంచి ఎన్నికల నిర్వహణ వరకు ప్రతి దశలోనూ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలనే డిమాండ్‌తో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ రాజీనామా చేయాలని ఈ ధర్నా వేదికగా నిరసనకారులు డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలపై ప్రజలకు విశ్వాసం నిలవాలంటే వాటి పనితీరు పారదర్శకంగా ఉండాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే పరిణామాలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ఓటు హక్కు పవిత్రతను కాపాడేందుకు పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు ప్రజలంతా తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు నిరసనలు ఆగవు

కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్

తెలంగాణ భవన్ లో సీఎం, పీసీసీ, రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో జరిగిన సమావేశంలో పాల్గొన్న నీలం

ఢిల్లీలోని బారకాంబ జంక్షన్ నుండి సుప్రీమ్ కోర్ట్ వరకు జరిగిన నిరసన మార్చ్ కార్యక్రమంలో హాజరు

పటాన్ చెరు, అక్టోబర్ 12 (నిలువుటద్దం ప్రతినిధి) : కేంద్ర ఎన్నికల సంఘం తీరును ఆక్షేపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలోని బారకాంబ జంక్షన్ నుండి సుప్రీమ్ కోర్ట్ వరకు కాంగ్రెస్ అగ్రనేతల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన మార్చ్ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జ్ నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో కలిసి ఆయన ఈ నిరసన ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. ఈ మార్చ్‌లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, సిఈసి వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ..ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష పేరుతో లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం, అధికార పార్టీకి కొమ్ము కాస్తూ రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి అతిపెద్ద ఆయుధమైన ఓటు హక్కును కాలరాసేందుకు జరుగుతున్న కుట్రలపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న ఈ పోరాటానికి తెలంగాణ కాంగ్రెస్ శ్రేణుల పూర్తి సన్నద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుండి తొలగించి, ప్రజాస్వామ్య బద్ధంగా ఓటర్ల జాబితాలను పునరుద్ధరించే వరకు ఢిల్లీ వీధుల నుంచి గ్రామ స్థాయి వరకు ఈ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

హైకోర్టు సర్వే ఆర్డర్లున్నా ఆగని నిర్మాణాలు కట్టడాలు ఆపాలంటూ హైడ్రాకు విన్నపాలు హైడ్రా ప్రజావాణికి 56 ఫిర్యాదులు

రంగారెడ్డి బ్యూరో నిలువుటద్దం; రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం ఇంజాపూర్ విలేజ్ సర్వే నంబరు 126లో 74.16 ఎకరాలప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని కాపాడాలంటూ రెవెన్యూ అధికారులకు లేఖలు రాయడమే కాదు.. హైకోర్టుకు కూడా అక్కడి స్థానికులు ఆశ్రయించారు. మొత్తం సర్వే చేసి ఆ భూమి వివరాలు తెలపాలని రెవెన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించింది. సర్వే జరగదు.. నిర్మాణాలు ఆగవు అనేట్టు అక్కడ కబ్జాలు జరుగుతున్నాయని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో వాపోయారు. పెద్ద గోదాములు నిర్మించి భూమిని తమ ఆధీనంలోకి కబ్జాదారులు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైకోర్టు ఆర్డర్ ప్రకారం సర్వే చేసి.. ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తుర్కయాంజల్ తొర్రూరు డివిజన్ ఇంజాపూర్ విలేజ్‌లోని పార్కుకోసం కేటాయించిన 1200ల గజాల స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయించేస్తున్నారని అక్కడి స్థానికులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కుంట్లూరులోని జయప్రకాష్‌నగర్ మంజీరా కాలనీలో కూడా 577 గజాల పార్కును కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 56 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించి.. వెనువెంటనే పరిష్కరించాలని హైడ్రా అధికారులను ఆదేశించారు. -ఫిర్యాదులు ఇలా..కూకట్‌పల్లి నల్ల చెరువును హైడ్రా ఎంతో బాగా అభివృద్ధి చేసింది. 5 మీటర్ల మేర పేరుకుపోయిన పూడిక వల్ల గతంలో ఈ చెరువులోని నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి ఉండేది కాదని.. హైడ్రా అభివృద్ధి చేసిన తర్వాత పరిసరాల్లో భూగర్భ జలాలు పెరిగాయని స్థానికులు ప్రజావాణిలో చెప్పారు. అయితే ఆ ఫలాలు స్థానిక నివాసితులకు దక్కనీయడంలేదని.. బోర్లతో తోడేసి నీటి వ్యాపారులు చేస్తున్నారని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువు పరిసరాల్లో బోర్లు వేసి నీటిని పెద్దమొత్తంలో తోడి వాణిజ్య అవసరాలకు అమ్మేసుకుంటున్నారని స్థానికులు ఫొటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేశారు. హయత్‌నగర్ మండలం.. నాగోలు నుంచి కుంట్లూరు వెళ్లే దారిలో నాలాతో పాటు.. ఆ పక్కనే ఉన్న 300ల గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని.. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నాలాను ఆక్రమించి ఇటీవలనే నిర్మించిన రెండు గదులను తొలగించి వరద ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని కోరారు. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ కలాన్ విలేజ్‌లోని 7.34 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురౌతోందని ఫిర్యాదు చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం దేవరయాంజల్ విలేజ్‌లోని కోమటికుంట ఫుల్ ట్యాంక్ పరిధిలో నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అ పక్కనే ఉన్న సర్వే నంబరు 63లో ప్రభుత్వ భూమితో పాటు.. ఎండోమెంట్ ల్యాండ్ ఉందని అందులో జరుగుతున్న నిర్మాణాలను ఆపాలని కోరారు. అలాగే గండిమైసమ్మ దుండిగల్ మండలం బహదూర్‌పల్లి విలేజ్ సర్వే నంబరు 131/1లట 20 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురౌతోందని ప్రజావాణి ఫిర్యాదులో పేర్కొన్నారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కొంపల్లి - యాప్రాల్ చెరువులను కలిపే వరద కాలువ కబ్జాలకు గురౌతోందని.. అక్కడ వెంచర్లు వేసినవవారు కబ్జాలకు పాల్పడుతున్నారని.. దీంతో వరద ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని వెన్‌రాగ్ ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. ఇదే ప్రాంతంలోని వంజరబస్తీలోని రహదారి కబ్జాకు గురౌతోందని.. ఫిర్యాదు అందింది. ఆర్.కె.పురం చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా పేర్కొంటారని.. ఆ చెరువు కబ్జాలకు గురౌతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పిగ్ శ్లాటర్‌హౌస్ నిర్మించి వ్యర్థాలను చెరువులోకి వదులుతున్నారని.. ఇలా దాదాపు 2 ఎకరాల వరకూ కబ్జా చేశారంటూ అక్కడి స్థానికులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కవాడిగూడ గాంధీనగర్‌లోని -నిర్ణయించారు. ఇదే ప్లేగ్రౌండ్‌లో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం కూడా ఉంది. బయట వాలీబాల్ కోర్టులున్నాయి. ఇక్కడి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులు అనేకమంది తయారయ్యారు. ఇలాంటి స్టేడియాన్ని కూరగాయల మార్కెట్ చేసేశారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారాంతపు సంతలు ఇక్కడ పెట్టి క్రీడలకు ఆస్కారం లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రీడాప్రాంగణాన్ని కాపాడాలని హైడ్రా ప్రజావాణిలో స్థానికులు కోరారు.

రాయికోడ్ లో రబీ శనగ విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

సోమవారం నుంచి టోకెన్ల జారీ - రైతులు సద్వినియోగం చేసుకోవాలని

మండల వ్యవసాయ అధికారి సారిక పిలుపు

నిలువుటద్దం , రాయికోడ్, అక్టోబర్ 12: సంగారెడ్డి జిల్లారాయికోడ్ మండలంలో రబీ సీజన్ కు సంబంధించిన శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సారిక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతులకు ప్రభుత్వ రాయితీపై శనగ విత్తనాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో సంచి ఇరవై ఐదు కిలోల చొప్పున, ధర వెయ్యి ఐదు వందల రూపాయలకు అందజేయనున్నట్లు వెల్లడించారు. విత్తనాల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం పదకొండు గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. విత్తనాల కోసం వచ్చే రైతులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు నకలు, భూమి పట్టాదారు పుస్తకం నకలు తీసుకురావాలని సూచించారు. టోకెన్ల పంపిణీ కోసం రాయికోడ్ మరియు ఇటికేపల్లి రైతు వేదికల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. రాయికోడ్ రైతు వేదిక వద్ద వ్యవసాయ విస్తరణ అధికారులు నిఖిలేష్, అర్చనశ్రీ, కల్పన అందుబాటులో ఉంటారని, ఇటికేపల్లి రైతు వేదిక వద్ద వ్యవసాయ విస్తరణ అధికారులు శివకుమార్, మమత, లక్ష్మీకాంత్ లు టోకెన్లు జారీ చేస్తారని తెలిపారు. కావున మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సకాలంలో టోకెన్లు పొంది నాణ్యమైన విత్తనాలను పొందాలని ఆమె కోరారు.

చైనా మాంజా విక్రయదారులపై కేసులు నమోదు చేయాలి

ప్రజల ప్రాణాలు కాపాడేందుకు పోలీసులకు సమాచారం ఇవ్వండి: రవీందర్ ముదిరాజ్

జీడిమెట్ల నిలువుటద్దం ప్రతినిధి: చైనా మాంజా ప్రాణాంతకంగా మారుతోందని, దాని విక్రయాలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని రవీందర్ ముదిరాజ్ కోరారు. గతంలో చైనా మాంజా కారణంగా బైక్‌పై వెళ్తున్నవారి మెడలకు గాయాలై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని, మిలిటరీ ఉద్యోగి, కానిస్టేబుల్‌తో పాటు పాదచారులు కూడా ప్రమాదాల బారినపడిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. తాజాగా జీడిమెట్లలో మనీష్ అనే వ్యక్తి చైనా మాంజా కారణంగా తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైన ఘటన ఆందోళన కలిగిస్తోందన్నారు. చైనా మాంజా విక్రయిస్తున్న వారి వివరాలు, చిరునామాలను గుర్తించిన వారు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, మహిళా సంఘాలు, కాలనీ అధ్యక్షులు, కార్యదర్శులు చైనా మాంజా విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలని, విక్రయదారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎం రాజు, అనిల్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

గోపన్‌పల్లి తండా శ్మశానవాటిక సమస్యలు పరిష్కరించాలి

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన రాగం హరి శంకర్ యాదవ్

నల్లగండ్ల, నిలువుటద్దం ప్రతినిధి: గోపన్‌పల్లి తండా శ్మశానవాటికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాగం హరి శంకర్ యాదవ్ ప్రజావాణిలో జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికలో వీధి దీపాలు, రహదారులు, భద్రత, నీటి సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదేవిధంగా అక్రమంగా చెత్తను వేస్తుండటంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోందని పేర్కొన్నారు. శంకరి రాజు ముదిరాజ్‌తో పాటు గ్రామస్థులు ఈ సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో స్పందించిన రాగం హరి శంకర్ యాదవ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వినతిపై స్పందించిన జోనల్ కమిషనర్ సమస్యల పరిష్కారానికి వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల బేగరి కాటికాపర్ల సంఘం అధ్యక్షుడు బి. పోచయ్య, కె. మల్లేష్, ములగిరి సత్యనారి, గడ్డం ఆనంద్, యాగమయ్య, రవికుమార్, మహేష్, నరసింహ, శ్రీకాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కిందికుంట పార్కులో ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ: మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

కూకట్‌పల్లి, నిలువుటద్దం ప్రతినిధి హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట పార్కులో ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఆడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారని, ఆటపాటలు, కోలాటాలతో కిందికుంట పార్కు ఆదివారం రాత్రి సందడిగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో ధనిక్ సిల్వర్ జువెలరీ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన ముగ్గురు మహిళలకు బహుమతులు అందజేశారు. ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్ పల్లి, నిలువుటద్దం ప్రతినిధి: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ఎల్‌ఐజీ 22--23 ప్రాంతంలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గారు మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు గారితో కలిసి సమస్యాత్మక ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే గారి దృష్టికి డ్రైనేజీ సమస్యను తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన సంబంధిత వాటర్‌వర్క్స్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గారు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ రాజేశ్ రాయ్, భవాని,వాటర్‌వర్క్స్ అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూ సమస్యపై బండి రమేష్ పరిశీలన

స్థానిక నాయకులతో చర్చ.. సమస్య వివరాలపై ఆరా

గాయత్రి నగర్, నిలువుటద్దం ప్రతినిధి: గాయత్రి నగర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 1007లో ఉన్న భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూమికి సంబంధించిన సమస్యను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులను అడిగి భూ సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న పరిస్థితులపై వారితో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందని బండి రమేష్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాయత్రి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్తాన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వేముల సత్యం, రాఘవేంద్రరావు, కనకయ్య, విట్టల్ రెడ్డి, ఇంద్ర సింగ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుల్జా భవాని ఆలయ పునర్నిర్మాణానికి సహకారం

గర్భగుడి గడపకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి, అక్టోబర్ 12, నిలువుటద్దం ప్రతినిధి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని తారానగర్‌లో శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ మహోత్సవంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి గర్భగుడి గడపకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, తెలంగాణ యాదవ కురుమ కో-ఆపరేటివ్ చైర్మన్ రఘునాథ్ యాదవ్‌తో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులతో సమావేశమై ఆలయ పునర్నిర్మాణ ప్రణాళికలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, తుల్జా భవాని ఆలయాన్ని శేరిలింగంపల్లి ప్రాంతంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యచంద్ర రెడ్డి, సీనియర్ నాయకుడు బీకే రాఘవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బీకే రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాజు యాదవ్, గౌరవ అధ్యక్షుడు వీరేశం గౌడ్, రఘునాథ్ రెడ్డి, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, కే. రాంచందర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్ తదితర నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరి అమ్మవారి సన్నిధిలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల జెశ్వంత్ రావు

తెలంగాణ బ్యూరో నిలువుటద్దం: దసరా నవరాత్రుల సందర్భంగా పూజ్యశ్రీ జగన్ గురూజీ ఆధ్వర్యంలో శ్రీ మాత యోగ అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల జెశ్వంత్ రావు, దేశాల్ మిత్రమండలి సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేశాల్ మిత్రమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యాధరి క్షేత్రంలో వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

గాయత్రి దేవిగా దర్శనం ఇచ్చిన అమ్మవారు.

వర్గల్ అక్టోబర్ 12(నిలువుటద్దం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వర్గల్ శ్రీ విద్యా సరస్వతి అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు తొమ్మిది రోజులపాటు భక్తులకు వివిధ అలంకారంతో దర్శనం ఇవ్వనున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవిద్యా సరస్వతి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో గణపతి పూజ విశేష పంచామృత అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి గాయత్రి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని పునీతులైనారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాలను అందజేశారు.

ఘనంగా జే. సురేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

మాదాపూర్, నిలువుటద్దం ప్రతినిధి: సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే జే. సురేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు మాదాపూర్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సన్నిహితులు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేసి, శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తన జన్మదిన వేడుకలకు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ సురేష్ ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలలో అనిల్ యాదవ్,నేహా యాదవ్, శ్రీకాంత్ యాదవ్, విశాల్ యాదవ్, తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

ప్రజా అవసరాలకు పెద్దపీట కాలనీ అభివృద్ధికి మరో ముందడుగు!

హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో నూతన దుకాణాలు, సిబ్బంది వసతి గృహం ప్రారంభం

అందుబాటులోకి వచ్చిన నూతన సదుపాయాలు.

సిబ్బందికి మెరుగైన వసతి కల్పించడం సంతోషకరం: పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, నిలువుటద్దం ప్రతినిధి శంషిగూడ, హైదర్‌నగర్ డివిజన్ల పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు మరో ముందడుగు పడింది. స్థానిక కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ఆయన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీ ప్రజలకు అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, కమ్యూనిటీ హాల్ నిర్వహణలో కీలక పాత్ర పోషించే సిబ్బందికి వసతి సౌకర్యం కల్పించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహం ప్రారంభంతో కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో సౌకర్యాలు మరింత మెరుగుపడ్డాయి. సిబ్బందికి వసతి కల్పించడం గొప్ప విషయం ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ, హెచ్ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సిబ్బందికి ప్రత్యేకంగా వసతి సౌకర్యం కల్పించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. నేటి నుంచి ఈ సదుపాయాలు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని వెల్లడించారు. కాలనీల అభివృద్ధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, స్థానికంగా నిర్వహించే సంస్థలకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచడం కూడా ముఖ్యమని ఈ సందర్భంగా స్పష్టమవుతోంది. కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో చేపట్టిన ఈ నిర్మాణాలు స్థానిక అవసరాలకు ఉపయోగపడతాయని నిర్వాహకులు, కాలనీవాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హెచ్ఎంటీ శాతవాహన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. రత్న ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం. బాబు రావు, ప్రధాన కార్యదర్శి ఎం. యాది రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు వి. వెంకట రావు, ఎస్. రామనాథం పాల్గొన్నారు. అలాగే హెచ్ఎంటీ శాతవాహన నగర్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, శ్రీ ఉమా మహేశ్వర ఆలయ కార్యవర్గ సభ్యులు, స్థానిక కాలనీవాసులు తదితరులు హాజరై నూతన సదుపాయాల ప్రారంభోత్సవంలో భాగస్వాములయ్యారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా సదుపాయాల కల్పన, సిబ్బందికి మెరుగైన వసతి, కాలనీల అభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో ప్రాధాన్యత సంతరించుకుంది.

భరత్ నగర్‌లో బతుకమ్మ సంబరాల సందడి.. పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా

మహిళల ఆటపాటలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం -- సంప్రదాయాలకు పెద్దపీట.

కూకట్‌పల్లి, నిలువుటద్దం ప్రతినిధి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు భరత్ నగర్ కాలనీలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని మహిళా సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. మహిళల ఆటపాటలు, బతుకమ్మ పాటలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, పూల పండుగ ప్రత్యేకతకు ఈ వేడుకలు అద్దం పట్టాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలానగర్ డివిజన్ ఏసీపీ పి. నరేష్ రెడ్డి, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్వామి గౌడ్ హాజరయ్యారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వేడుకల్లో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నాగేశ్వర్ రావు, మూర్తి, బిక్షపతి గౌడ్, బాబు, నరేష్ కుమార్, మధు, వెంకటేష్ యాదవ్, శారద, విజయ్ కుమార్, అర్చన, దీపా, బుచ్చిబాబు, డేవిడ్, అశోక్, రాజు పాల్గొన్నారు. కాలనీ సంక్షేమ సంఘం, ఆలయ కమిటీ సభ్యుల సమన్వయంతో నిర్వహించిన ఈ వేడుకలు మహిళల్లో ఆనందోత్సాహాలను నింపాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, సమాజంలో ఐక్యతను పెంపొందించేలా బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జరుపుకోవడం విశేషం.

మౌనంలో మంత్రం మనసులో దైవం!

పెదవులు కదలకున్నా పలుకుతుంది పరమాత్మ నామం మనసు లీనమైతే మానసిక జపమే మోక్షమార్గానికి సోపానం!

మానసిక మంత్రజపం యొక్క విశిష్టత -- నిశ్శబ్దంలో నామస్మరణ, నామస్మరణలో ఆత్మానందం మంత్రజపానికి మాలే ప్రధానం కాదు... మనసే ప్రధాన సాధనం! భగవంతుడిని స్మరించడానికి ప్రత్యేకమైన సమయం కావాలా? పూజా మందిరంలోనే కూర్చోవాలా? చేతిలో జపమాల పట్టుకోవాలా? కళ్లు మూసుకొని ధ్యానంలోనే ఉండాలా? ఇవన్నీ భక్తి సాధనకు ఉపయోగపడే మార్గాలే అయినప్పటికీ, భగవన్నామ స్మరణకు అవే తప్పనిసరి నియమాలు కావు. నిజమైన భక్తి హృదయంలో పుడుతుంది. నిజమైన నామస్మరణ మనస్సులో కొనసాగుతుంది. మనిషి తన రోజువారీ జీవితంలో అనేక పనులు చేస్తుంటాడు. కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తాడు. ఉద్యోగం చేస్తాడు. ప్రయాణిస్తాడు. ఇతరులతో మాట్లాడుతాడు. ఎన్నో ఆలోచనల మధ్య కాలం గడుపుతాడు. అయితే, ఈ పనులన్నింటి మధ్యలోనూ తన ఇష్టదైవాన్ని మనసులో స్మరించుకోవచ్చు. అలా శబ్దం లేకుండా, పెదవులు కదలకుండా, మనస్సులోనే మంత్రాన్ని పునరావృతం చేస్తూ సాగించే సాధననే మానసిక మంత్రజపం అంటారు మౌనంగా సాగే మంత్రం... మనసును మార్చే సాధనం! మానసిక జపంలో మంత్రాన్ని ఇతరులకు వినిపించాల్సిన అవసరం లేదు. నాలుకతో పలకాల్సిన అవసరం లేదు. చేతిలో మాల ఉండాల్సిన అవసరం కూడా లేదు. మనస్సులోనే గురువుల ద్వారా ఉపదేశించబడిన మంత్రాన్ని లేదా భగవన్నామాన్ని భక్తిశ్రద్ధలతో స్మరించుకోవడం ఈ సాధనలో ప్రధానమైన అంశం. ఉదాహరణకు, మనస్సులోనే "శ్రీరామ... శ్రీరామ... శ్రీరామ..." అని స్మరించుకోవచ్చు. అలాగే, గురువుల ద్వారా ఉపదేశం పొందిన అమ్మవారి మంత్రాన్ని మనస్సులోనే జపించుకోవచ్చు. బయటకు ఎలాంటి శబ్దం వినిపించకపోయినా, అంతరంగంలో నామస్మరణ కొనసాగుతుంది. శరీరం తన పనులు చేసుకుంటున్నప్పటికీ, మనస్సు భగవన్నామాన్ని ఆశ్రయించేందుకు ప్రయత్నిస్తుంది. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, మంత్రాన్ని యాంత్రికంగా పదేపదే తలచుకోవడం మాత్రమే కాకుండా, దాని పట్ల భక్తి, శ్రద్ధ, గౌరవం కలిగి ఉండటం కూడా ముఖ్యం. మనస్సు ఎక్కడికైనా వెళ్లినప్పుడు, దానిని మళ్లీ మంత్రంపైకి తీసుకురావడమే సాధనలో భాగం. జపంలో మూడు విధాలు... సాధనలో ఒక్కటే లక్ష్యం! ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో మంత్రజపాన్ని సాధారణంగా మూడు విధాలుగా వివరిస్తారు.

1. వాచిక జపం: మంత్రాన్ని స్పష్టంగా నోటితో పలుకుతూ చేసే జపం. మంత్రధ్వని మనకు, సమీపంలో ఉన్నవారికి వినిపించవచ్చు.
2. ఉపాంశు జపం: పెదవులు స్వల్పంగా కదులుతూ, మంత్రధ్వని చాలా తక్కువగా లేదా ఇతరులకు వినిపించనంత మృదువుగా చేసే జపం.
3. మానసిక జపం: మంత్రాన్ని నోటితో పలకకుండా, పెదవులు కదపకుండా, మనస్సులోనే స్మరించే జపం.

ఈ మూడు విధానాలూ భక్తి సంప్రదాయాల్లో ప్రాధాన్యం కలిగినవే. కొన్ని సాధనా సంప్రదాయాలు మానసిక జపాన్ని అత్యంత సూక్ష్మమైన సాధనగా ప్రశంసిస్తాయి. అయితే, ఏ విధానం మనకు అనుకూలంగా ఉంటుందనేది మన సాధనా స్థాయి, ఏకాగ్రత, గురువుల మార్గదర్శకత్వంపై ఆధారపడి ఉంటుంది. మానసిక జపం ఎందుకు విశిష్టమైనది? మనస్సుకు ఏకాగ్రతను అలవాటు చేస్తుంది: మనస్సు సహజంగానే ఒక ఆలోచన నుంచి మరో ఆలోచనకు పరుగులు తీస్తుంది. మంత్రాన్ని పదేపదే స్మరించుకోవడం ద్వారా దృష్టిని ఒకే అంశంపై నిలిపే అలవాటు పెంపొందించుకోవచ్చు. నామస్మరణను జీవితంలో భాగం చేస్తుంది: పూజకు ప్రత్యేక సమయం కేటాయించలేని సందర్భాల్లో కూడా, ఇతర పనులకు ఆటంకం కలగని సమయంలో మనసులో భగవన్నామాన్ని స్మరించుకోవచ్చు. దీంతో ఆధ్యాత్మిక సాధన రోజువారీ జీవితంతో అనుసంధానమవుతుంది. అంతరంగ ప్రశాంతతకు తోడ్పడుతుంది: భక్తితో మంత్రాన్ని స్మరించడం కొందరికి ఆందోళనకరమైన ఆలోచనల నుంచి కొంత విరామాన్ని అందించి, ప్రశాంతంగా ఉండటానికి సహాయపడవచ్చు. అయితే, ఇది ప్రతి సమస్యకు పరిష్కారం కాదు; వ్యక్తుల అనుభవాలు భిన్నంగా ఉండవచ్చు. భక్తిభావాన్ని పెంపొందిస్తుంది: ఇష్టదైవాన్ని తరచుగా స్మరించుకోవడం ద్వారా దైవంపై అనుబంధం, విశ్వాసం, కృతజ్ఞతాభావం బలపడవచ్చు. క్రమశిక్షణను అలవాటు చేస్తుంది: మనస్సు చెదిరిపోయిన ప్రతిసారీ దానిని తిరిగి మంత్రంపైకి తీసుకురావడం ఒక నిరంతర సాధన. ఈ ప్రయత్నం మన ఆలోచనలను గమనించే అలవాటును పెంపొందిస్తుంది. మంత్రజపం ఎలా చేయాలి? ఆచరణలో పాటించాల్సిన విషయాలు మానసిక జపాన్ని ప్రారంభించడానికి మొదట ప్రశాంతమైన ప్రదేశంలో కొన్ని నిమిషాలు కూర్చోవచ్చు. శ్వాస సహజంగా సాగనివ్వాలి. మనకు ఉపదేశించబడిన మంత్రాన్ని లేదా ఇష్టదైవ నామాన్ని మనస్సులో నెమ్మదిగా స్మరించుకోవాలి. ఇతర ఆలోచనలు వచ్చినప్పుడు వాటితో పోరాడకుండా, మళ్లీ మంత్రంపై దృష్టిని నిలపాలి. అలవాటు పెరిగిన తర్వాత నడుస్తున్నప్పుడు, ప్రయాణిస్తున్నప్పుడు లేదా ఇతరులకు ఇబ్బంది కలగని సాధారణ పనులు చేస్తున్నప్పుడు కూడా నామస్మరణ కొనసాగించవచ్చు. అయితే, వాహనం నడపడం, రహదారి దాటడం, యంత్రాలు నిర్వహించడం వంటి పూర్తి శ్రద్ధ అవసరమైన పనుల్లో భద్రతకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. మంత్రదీక్ష పొందినవారు తమ గురువులు సూచించిన విధానాన్ని, నియమాలను పాటించడం మంచిది. మంత్రదీక్ష లేనివారు తమ సంప్రదాయానికి అనుగుణంగా ఇష్టదైవ నామస్మరణతో ప్రారంభించవచ్చు. ముఖ్యంగా, మంత్రజపంలో తొందరపడాల్సిన అవసరం లేదు. ఎన్ని వేలసార్లు జపించామన్న లెక్కకంటే, ఎంత శ్రద్ధతో స్మరించామన్నదానికి సాధనలో ప్రత్యేకమైన విలువ ఉంటుంది. మాల ఉపయోగించడం తప్పు కాదు; మాల లేకుండా జపించడం కూడా తప్పు కాదు. సాధనకు సహాయపడే సాధనాల కంటే మనస్సులోని భక్తి, శ్రద్ధ, క్రమబద్ధత ముఖ్యం. మనస్సే మందిరం... నామమే నైవేద్యం! దేవాలయానికి వెళ్లడం భక్తికి ఒక మార్గం. ఇంట్లో పూజ చేయడం మరో మార్గం. ధ్యానం చేయడం, స్తోత్రాలు పఠించడం, భజనలు చేయడం కూడా భక్తిని వ్యక్తపరిచే మార్గాలే. వీటితోపాటు మానసిక నామస్మరణ మనిషి అంతరంగంలో దైవచింతనను నిలిపేందుకు తోడ్పడుతుంది.బయట ప్రపంచంలో ఎన్నో శబ్దాలు వినిపిస్తున్నా, మనస్సులో భగవన్నామం మృదువుగా కొనసాగవచ్చు. చేతులు పనులు చేస్తున్నా, హృదయం భక్తితో నిండవచ్చు. జీవన బాధ్యతలను విస్మరించకుండా, వాటిని సమర్థంగా నిర్వహిస్తూ దైవస్మరణకు చోటివ్వడమే ఈ సాధనలోని అందం. అయితే, మానసిక జపం



చేస్తున్నామని మనస్సు ఎప్పుడూ పూర్తిగా ఏకాగ్రంగా ఉంటుందని భావించకూడదు. ఒక్కోసారి ఆలోచనలు అడ్డుపడతాయి. ఒక్కోసారి మంత్రం మరచిపోతాం. మరికొన్ని సందర్భాల్లో మనస్సు అలసిపోతుంది. ఇవన్నీ సాధనలో ఎదురయ్యే సహజమైన అనుభవాలుగా భావించి, ఓర్పుతో మళ్లీ నామస్మరణను కొనసాగించవచ్చు. ముగింపు: పెదవులపై పలకకున్నా... హృదయంలో నిలవాలి! మానసిక మంత్రజపం అనేది కేవలం మంత్రాన్ని మనస్సులో పలకడం మాత్రమే కాదు; మన దృష్టిని పదేపదే భగవన్నామం వైపు మళ్లించుకునే ఆధ్యాత్మిక సాధన. దాని ద్వారా భక్తిని పెంపొందించుకోవచ్చు, మనస్సును ప్రశాంతంగా ఉంచేందుకు ప్రయత్నించవచ్చు, జీవనంలో ఆత్మపరిశీలనకు అవకాశం కల్పించుకోవచ్చు. మంత్రం శబ్దంగా వినిపించకపోయినా, దాని స్మరణ మన అంతరంగంలో కొనసాగవచ్చు. చేతిలో మాల లేకపోయినా, మనస్సులో నామం నిలవవచ్చు. ప్రత్యేకమైన పూజా సమయం లేకపోయినా, భక్తికి మన జీవితంలో కర్తవ్యాలను నిర్వర్తిస్తూనే, భక్తి, వినయం, దయ, ధర్మం వంటి సద్గుణాలను జీవితంలో ఆచరించాలి. అప్పుడు నామస్మరణ కేవలం ఒక అలవాటుగా కాకుండా, మన జీవన విధానంలో భాగంగా మారుతుంది. మంత్రం మనసులో... భక్తి హృదయంలో... దైవచింతన జీవితాంతం!

Printed, Published and owned by Y. Ramadevi on behalf of NAGAPUBLICATIONS and printed of Koushik Printers, Vidya Nagar, Hyderabad
Published.... 3/5, MIG Flats, KPHB, Hyderabad 500072, Editor Y. Nagaraju, Ph. No. 9059548848 RNI:APTEL/2001/14027